# రూ.50 వేలు ఇస్తేనే ఉద్యోగం

డబ్బులు పంపితే ఉద్యోగం గ్యారంటీ అంటూ మోసగాళ్లు ఆన్‌లైన్ వేదికగా రెచ్చిపోతున్నారు. నిరుద్యోగులకు ఉద్యోగం పేరిట వల వేసి దోచుకునే ప్రయత్నం చేస్తున్నారు. మాయమాటలతో నమ్మబలికి మోసాలకు పాల్పడుతున్నారు. రూ.50 వేలు ఇస్తే ఉద్యోగం గ్యారంటీ అంటూ అభ్యర్థులకు మరిన్ని ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. ఇప్పటికే కొంత మంది ఈ నేరగాళ్ల వలలో పడి డబ్బులు పంపినట్లు తెలియజేస్తూ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

- మెడికల్ పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్
- గత వారం ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల
- ఇదే అదునుగా రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- జాబ్ గ్యారంటీ పేరుతో నగదు డిమాండ్



డీఎంహెచ్‌ఓ కార్యాలయం, చిత్తూరు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గతేడాది జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ఎన్‌హెచ్‌ఎంలో పలు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ పోస్టుల దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. భర్తీ ప్రక్రియలో భాగంగా గతవారం ప్రొవిజనల్ మెరిట్ లిస్టును ప్రకటించారు. ఈ తరుణంలో అభ్యర్థులకు మెరిట్ ఆధారంగా పోస్టులకు తమకు వరిస్తాయని కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. ఇందుకు లక్షల్లో డబ్బులిచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నారు. అయితే ఇదే అదునుగా భావించి సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. వారం క్రితం ఆన్‌లైన్‌లో పెట్టిన ప్రొవిజనల్ మెరిట్‌లిస్టును అందిపుచ్చుకొని అభ్యర్థులను మోసగించేందుకు రంగంలోకి దిగారు. ఇది పెద్ద నెట్‌వర్క్‌గా తెలుస్తోంది.

**ఆ ఒక్క నంబర్‌తోనే..**

రెండు రోజుల క్రితం 8981491288 నంబర్ నుంచి వచ్చిన ఫోన్ కాల్ కలకలం సృష్టించింది. ఆ వ్యక్తి స్టాఫ్ నర్సు ఉద్యోగం ఇప్పిస్తామన్న డబ్బు డిమాండ్ చేశారు. ఆ నంబర్‌ను ట్రూకాల్‌లో పరిశోధిస్తే డి బాలాజీ అనే పేరు వస్తోంది. దీనిని కలెక్టర్ కూడా సీరియస్‌గా తీసుకున్నారు. ఇది మరవక ముందే మళ్లీ అదే నంబర్‌తో ఫోన్స్ కాల్స్ వస్తుండడం గమనార్హం.

**సైబర్ నేరగాళ్ల మాటలు ఇలా..**

నగరికి చెందిన జయకుమారి అనే అభ్యర్థికి సైబర్ నేరగాళ్లు శనివారం ఫోన్ చేసి మాటల్లోకి దింపే ప్రయత్నం చేశారు. అయితే ఆ వాయిస్ రికార్డులను జిల్లా వైద్య ఆరోగ్య అభ్యర్థులకు పంపారు. ఆ నేరగాడి సంభాషణ ఎలా ఉందో చూద్దాం.

**హలో జయకుమారి యా. నేను డీఎంహెచ్‌ఓ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నాను. మీరు స్టాఫ్‌నర్సు పోస్టుకు దరఖాస్తు చేసుకున్నారు కదా. నేను మీ కులం వాన్నే. మీకు సపోర్ట్ చేద్దామని ప్రయత్నిస్తున్నా. ప్రొవిజినల్ మెరిట్ లిస్టులో మీ పేరు ఉంది చూసుకున్నారా. (లిస్టులో ఉన్న వివరాలను గుచ్చి గుచ్చి చెబుతాడు). పోటీ గట్టిగా ఉంది. ఈ ఉద్యోగం పర్మినెంట్ చేయిస్తాం. జీవితాంతం ఉద్యోగం చేసుకోవచ్చు. నెలకు రూ.40 వేల జీతం. ఈ విషయం బయట ఎక్కడా చెప్పకండి. మీకు ఉద్యోగం అవసరమనుకుంటే రూ.50వేలు ఇవ్వాల్సి ఉంటుంది. 5 నిమిషాల్లో రూ.25 వేలు ఇవ్వండి. తరువాత మిగతా రూ.25 వేలు ఇవ్వచ్చు. నేను చెప్పినట్టు వినండి. తొందరగా ఫోన్ పే, జీ పే ఓపెన్ చేయండి రూ.25వేలు పంపండి. లేకుంటే మీ వెనుక చాలా మంది ఉద్యోగం కావాలని డబ్బులు పంపేందుకు సిద్ధంగా ఉన్నారు. డబ్బులు పంపితే వెంటనే ఫైనల్ మెరిట్ లిస్టులో మీ పేరు ఉంటుంది. లిస్టు వచ్చాక ధైర్యంగా మా సార్ దగ్గరకు వెళ్లండి. పోస్టు గ్యారంటీ. తొందరగా డబ్బులు పంపండి. తర్వాత మెయిల్ ఐడీ పంపండి** అంటూ నమ్మబలికారు.

ఇప్పటికే చాలా మంది నుంచి రూ.25 వేల చొప్పున నొక్కేసినట్లు తెలుస్తోంది. కొంత మంది అనుమానంతో ఆ వాయిస్ రికార్డ్ చేసి అప్రమత్తమవుతున్నారు.

**పోస్టుల భర్తీ.. దరఖాస్తు వివరాలు**

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఎన్‌హెచ్‌ఎంలో పలు పోస్టులకు భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 23 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ మేరకు డిసెంబర్ 13వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. దీంతో మొత్తం 1,452 దరఖాస్తులు వచ్చాయి. పోస్టుల వారీగా చూస్తే ఫిజీషియన్ -1 పోస్టుకు గాను 02 దరఖాస్తులు వచ్చాయి. మెడికల్ ఆఫీసర్ 2కు గాను 26, డెంటిస్ట్ 1కి గాను 121, ఆడియోలజిస్ట్-1కి గాను 10 దరఖాస్తులు, స్పెషల్ ఎడ్యుకేటర్ -1కి గాను 25 దరఖాస్తులు, అప్తోమెట్రిస్ట్ -1కి గాను 03 దరఖాస్తులు, స్టాఫ్‌నర్సు -5కు గాను 780 దరఖాస్తులు, ల్యాబ్ టెక్నీషియన్ 2కు గాను 100 దరఖాస్తులు, ఫార్మాసిస్ట్ -2కు గాను 153 దరఖాస్తులు, లాస్ట్ గ్రేడ్ సర్వీస్ 7 పోస్టులకు గాను 232 దరఖాస్తులు అందాయి.

**ఇది పెద్ద నెట్‌వర్క్‌లా ఉంది**

ఈ వ్యవహారం వైద్యశాఖకు సంబంధం లేదు. ఫోన్‌కాల్స్ వచ్చిన నంబరును పరిశీలిస్తే.. నార్త్ ఇండియన్‌ది. ఇది సైబర్ నేరగాళ్ల పనే. ఇది పెద్ద నెట్‌వర్క్‌లా ఉంది. ఆన్‌లైన్‌లో పెట్టిన ప్రొవిజన్ లిస్టులను తీసుకుని ఇలా చేస్తున్నారని తెలిసింది. అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాల్సిందే. నమ్మి మోసపోకండి. పోస్టుల భర్తీ పారదర్శకంగా జరుగుతుంది. జిల్లాలో కూడా తెలిసిన వ్యక్తులకు ఎవరైనా కూడా డబ్బులిస్తే ఉద్యోగం తీయిస్తామంటే నమ్మకండి.

–సుధారాణి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

## క్లుప్తంగా

### నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి స్పందన జరుగుతుందని, ప్రజల ఫిర్యాదులు స్పందనలో స్వీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### విద్యార్థులు కష్టపడి చదవాలి


బోడబండ్లలో 10వ తరగతికి స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ మార్కులు సాధించాలని బోడబండ్ల సర్పంచ్ నిర్మల మొగిలీశ్వర్ అన్నారు. బోడబండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం చదువుకుంటున్న 10వ తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ శాఖ తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను ఆ శాఖ మాజీ మండల అధ్యక్షులు మొగిలయ్య ఆధ్వర్యంలో ఉచితంగా అందజేశారు. ఆమె మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించేది 10వ తరగతి పబ్లిక్ పరీక్షలే అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. అందుకు కష్టపడి చదవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు హరిత పాల్గొన్నారు.

### నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు. కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. సమస్యలున్న ప్రజలు అర్జీల రూపంలో తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని తెలిపారు.

### దళిత సత్రం మంజూరుకు హామీ


ఏడీసీ కేశవులను గజమాలతో సన్మానిస్తున్న దళిత నాయకులు

ఐరాల: మండలంలోని కాణిపాకం ఆలయం దగ్గరలో దళిత సత్రం మంజూరు చేస్తామని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ హామీ ఇచ్చినట్లు దేవదాయశాఖ విశ్రాంత ఏడీసీ కేశవులు తెలిపారు. కాణిపాకం జెడ్పీ హైస్కూల్ క్రీడామైదానంలో ఆదివారం ఏడీసీ ఆధ్వర్యంలో శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దళిత ఉభయ కర్తలు, దళిత సత్రం సేవా సమితి సభ్యులు ద్వితీయ వార్షికోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ఏడీసీ మాట్లాడుతూ ఆలయం దగ్గరలో దళిత సత్రం మంజూరుకు ఎమ్మెల్యే హామీ ఇవ్వడం ఆలయ దళిత ఉభయకర్తలకు, దళిత సత్రం సంబంధీకులకు శుభ పరిణామం అన్నారు. అనంతరం దళిత నాయకులు ఆయన్ను గజమాలతో సత్కరించారు.

### ఉద్యోగ భద్రత కల్పించాలి

శ్రీరంగరాజపురం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు అన్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గం అధ్యక్షుడు గోవిందస్వామి ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రం నుంచి పుల్లూరు క్రాస్ వరకు కార్మికులతో కలసి ర్యాలీ నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్నా ఇంత వరకు కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. వెంటనే ఆశ, అంగన్‌వాడీ, స్కూల్ ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

## గాయపడిన ఓంశక్తి భక్తులకు పరామర్శ


గాయపడిన భక్తులకు పండ్లను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు

బంగారుపాళెం: మండలంలోని జంబువారిపల్లె విద్యుదాఘాతంలో తీవ్రంగా గాయపడిన ఓంశక్తి భక్తులు త్వరగా కోలుకోవాలని మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సునీల్‌కుమార్, లలితకుమారి ఆకాంక్షించారు. జంబువారిపల్లెలో గాయపడిన ఓంశక్తి భక్తులను ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పరామర్శించారు.

## వీరజవాన్ కుటుంబానికి అండగా ఉంటా


కార్తీక్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న బోడె రామచంద్ర యాదవ్

బంగారుపాళెం: ఉగ్రవాదుల ఎదురుకాల్పుల్లో మృతి చెందిన వీరజవాన్ కార్తీక్ కుటుంబానికి అండగా ఉంటానని భారత చైతన్య యువజన పార్టీ(బీసీవై) అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్ అన్నారు. ఎగువరాగిమానుపెంట గ్రామంలో ఆదివారం వీరజవాన్ కార్తీక్ చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన వంతు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్తీక్ తల్లి సెల్వి, తండ్రి వరదరాజు మందడి, సోదరుడు రాజేష్‌కు ధైర్యం చెప్పారు. దేశ ప్రజలు వీరజవాన్ కార్తీక్‌ను మరచిపోరని చెప్పారు.

## అనుమానాస్పద వ్యక్తులతో జాగ్రత్త


రికార్డులులేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేసిన పోలీసులు


ఇంద్రానగర్‌లో కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

బంగారుపాళెం: గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సీఐ శ్రీనివాసులు అన్నారు. ఆయన సిబ్బందితో కలిసి మండలంలోని ఇంద్రానగర్, పాలమాకులపల్లె గ్రామాల్లో ఆదివారం కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రజలకు పోలీసులు దగ్గరవ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ, భద్రత కల్పించడం కోసం పోలీస్‌శాఖ కృషి చేస్తోందన్నారు. గ్రామాల్లో డ్రగ్స్, గంజాయి, సారా విక్రయాలు వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వ్యక్తులు నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా ఎలాంటి రికార్డులు లేని 8 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. గ్రామంలో సభ ఏర్పాటు చేసి అపరిచితులు, అనుమానితుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

## విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూస్తాం


కొత్తపల్లె సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ

గుడిపాల: విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూస్తామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ అన్నారు. ఆయన ఆదివారం కొత్తపల్లె, సీకే పల్లె సబ్‌స్టేషన్‌లను ఆయన పరిశీలించారు. ఎస్‌ఈ మాట్లాడుతూ చిత్తూరు- తచ్చూరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 132 కేవీ లైన్ మార్పులు జరుగుతున్నందున గుడిపాల మండలానికి ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 197 రామాపురం సబ్‌స్టేషన్‌కు బీఎన్‌ఆర్‌పేట నుంచి, రెడ్డిగుంట, తుమ్మిందపాళ్యం సబ్‌స్టేషన్ నుంచి 189 కొత్తపల్లె సబ్‌స్టేషన్‌కు విద్యుత్‌ను అందజేస్తామన్నారు. ఎక్కడా గాని విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూస్తామన్నారు. త్వరలో గ్రామాల్లో కూడా 24 గంటల విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వ్యవసాయానికి ప్రత్యేకంగా విద్యుత్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మునిచంద్ర, ఏడీ ఆనంద్, ఏఈ కరీముల్లా, లైన్‌మన్ గోవిందన్ ఉన్నారు.

## దేవయ్య సేవలు ఆదర్శనీయం


దేవయ్య దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కార్వేటినగరం: ఉపాధ్యాయుడిగా, సంఘ నాయకుడిగా వివిధ హోదాల్లో పని చేసిన దేవయ్య సేవలు నేటి తరం ఉపాధ్యాయులకు ఆదర్శనీయమని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం( ఎస్టీయూ) రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆర్కేవీబీ పేట ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన దేవయ్య సన్మాన కార్యక్రమాన్ని హెచ్‌ఎం అరుణ ఆధ్వర్యంలో నిర్వహించారు. సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా, సంఘ నాయకుడిగా దేవయ్య సేవలను కొనియాడారు. ఎంఈఓ ఎం.విజయకుమార్, పాఠశాల కమిటీ చైర్మన్ సాంబశివ ఆచారి, ఎస్టీయూ కార్యదర్శి హేమచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్‌రెడ్డి, మోహన్, యువరాజు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఎస్ నాయుడు, జిల్లా అధ్యక్షుడు కిరణ్, పీఆర్‌టీయూ గురుమూర్తి,డైట్ అధ్యాపకుడు చెంగల్‌రాజు, యూటీఎఫ్ నాయకులు వేణుగోపాల్, రాబర్ట్, సహదేవనాయుడు, దేవరాజులురెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో సర్కారు చెలగాటం

- వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు పోస్టర్ల ఆవిష్కరణ
- మీడియా సమావేశంలో సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్

బంగారుపాళెం: కూటమి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతూ ఇబ్బందులకు గురి చేస్తోందని వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ ఘండిపడ్డారు. మండలంలోని పాలేరు గ్రామంలో ఆదివారం సాయంత్రం పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి నివాస గృహంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు ప్రజలకు సూపర్‌సిక్స్ హామీలతో మభ్యపెట్టి తీరా అధికారం చేపట్టాక వాటి అమలును చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో ఉన్నతంగా ఎదగాలనే లక్ష్యంతో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్సుమెంట్ పథకాన్ని తీసుకువచ్చారన్నారు. ఈ పథకాన్ని గత ప్రభుత్వంలో మరింత పటిష్టంగా అమలు చేశారని అన్నారు. కరోనా కష్ట కాలంలోనూ విద్యార్థులకు సంబంధించిన ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులను విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లోకి జమచేశారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు.

**చేతులెత్తేసిన కూటమి సర్కార్**

కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుపై చేతులెత్తేసిందని సునీల్ కుమార్ విమర్శించారు. సీఎం చంద్రబాబు పథకాలను అమలు చేయడం కష్టంగా ఉందని చెప్పడం సిగ్గుచేటన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన నాయకుడు చెప్పే చేతగాని మాటలు ఇవేనా అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై వైఎస్సార్‌సీపీ నిరంతర పోరాటంలో వెనకడుగు వేయదన్నారు. ఫీజు పోరుపై ఈ నెల 5వ తేదీ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం మాయమాటలను నమ్మి మహిళలు మోసపోయారని చెప్పారు. విద్యార్థుల ఫీజులు చెల్లించలేక వారి తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్‌ఎంపీపీ శిరీష్‌రెడ్డి, సర్పంచుల మండల సంఘం అధ్యక్షుడు సుబ్రమణ్యం, మాజీ సర్పంచులు థామస్, ప్రకాష్‌రెడ్డి, విజయకుమార్, అరుణామల్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షులు సర్దార్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు కిషోర్‌కుమార్‌రెడ్డి, ఎస్సీసెల్ మండల అధ్యక్షులు, నాగరాజ, యూత్ అధ్యక్షులు గజేంద్ర, మాజీ ఏఎంసీ డైరెక్టర్ పాలాక్షిరెడ్డి, వడ్డెర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మొగిలీశ్వర, కో ఆప్షన్ సభ్యులు ఫిరోజ్ మహ్మద్, ఎంపీటీసీ హేమచంద్ర, నాయకులు భాను ప్రకాష్‌రెడ్డి, ఖాదర్, ముబారక్, శైలేష్, పాల్గొన్నారు.

## నేడు 35 యర్లంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని 35 యర్లంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే వైద్య శిబిరంలో వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు. మంచానికే పరిమితమైన రోగులకు ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



## వణికిస్తున్న చలి

గుడిపాల: చలి పంజా విసురుతోంది. దీంతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. ఉదయం 8 గంటల వరకు పొగమంచు కమ్మేస్తుండడంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. గ్రామాల్లో పనులు చేసుకునేందుకు పొలాల్లోకి వెళ్లే రైతులు, దినసరి కూలీలు, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసేవారు, పట్టణాల్లో విద్యాసంస్థలకు వెళ్లే గ్రామాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8గంటల వరకు మంచు కమ్మేస్తోంది. ఈ కారణంగా వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో పలు చోట్ల చలిమంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు.


పొగమంచు కారణంగా జాతీయ రహదారిపై లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్న వాహనాలు


బసవాపల్లె వద్ద పంటపొలాల్లో కమ్ముకున్న మంచు


వసంతాపురం వద్ద పొగమంచుతో పంటపొలాలు